# జూము

ఆ దుష్ట సంగీతాలాపనకు గాఢ నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాను. రోజుకంటే ఈ రోజు అరగంట ముందుగా లేచి తన సంగీత సాధన మొదలపెట్టింది మండోదరి. ఆమె గొంతులో వర్షాకాలంలోని కప్పల బెకబెకలు, నిశరాత్రి కీకారణ్యంలో కీచురాళ్ళ రొదలు వినిపిస్తున్నాయి. ఇది ఈ రోజు నుంచీ కాదు. గత మూడు నెలలుగా జరుగుతున్న కాండవదహనం.

మా ఇంటి ప్రక్క పోర్షను మల్లీశ్వరరావుకు అద్దెకిచ్చి మూడు నెలలయింది. పదేళ్ళ క్రితం రిటైరయిన వాణ్ణి నేను. పిల్లలిద్దరిలో ఒకడు అమెరికాలో, మరొకడు ఇంగ్లండులో సెటిలయిపోయారు. ఈ వయసులో వాళ్ళు పిలిచినా మాతృదేశం వదిలి వెళ్ళలేక భార్యతోడుగా ఇండియాలోనే వుండిపోయాను. అద్దెకిచ్చి సదరు అద్దెతో బ్రతకాల్సిన అవసరం లేకపోయినా తోడుకోసం, నా భార్య కాలక్షేపం కోసం ఇంటిలోని ఒకభాగం మల్లేశ్వరరావనే మతి చెడిన ఒక ప్రైవేటు కంపెనీ ఉద్యోగికి అద్దెకిచ్చాను.

మల్లేశ్వరరావుకి మతి చెడిన వారం రోజుల తర్వాత అతని భార్య నా భార్యకు చెబితే, నా భార్య నాకీవిషయం చెప్పింది. ఇంతకీ అతనికి మతి చెడడానికి కారణం వంద సంబంధాలు చూసినా తన ఏకైక ముద్దుల కుమార్తె మండోదరికి మనువు కాకపోవడం. అయినా అతనికి అంత పేరాశ పనికిరాదని నా నమ్మకం. ఎందుకంటే మండోదరిని చేసుకున్న ఎవడైనా ఆమె విశ్వరూపం చూసి జడుసుకుని చావాల్సిందే. అలా ఆమెను వితంతువుగా చేసేకంటే పెళ్ళి కాని పిల్లలా నిత్య నూతనంగా చూసుకోవడం నయం.

మండోదరికి పాతికేళ్ళుంటాయి. నల్లగా, పొట్టిగా లావుగా వుంటుంది. వెడల్పయిన నోరు, నోట్లోంచి బయటికి వచ్చి ఎల్లప్పుడూ సన్‌బాత్ చేస్తున్నట్లు తెల్లగా మెరిసే పళ్ళు.

ఎలుకతోకలాంటి జానెడు జడ, గుడ్ల గూబనుంచి అరువు తెచ్చుకున్నట్లు కళ్ళు, ముక్కు మగ గొంతు. ఆమెను ఈ లోకంలో ఒక స్పెసిమన్‌గా నిలబెడుతాయి. అయితే అభినందించాల్సిన విషయం ఆమెలోని ఆత్మవిశ్వాసం. తానెప్పుడూ అనాకారిని కానని అనుకోవడం. ప్రపంచ సుందరి యుక్తాముఖి పోలికలు తనలో వున్నాయని చెప్పుకుని మరీ ఆనందించడం.

పాపము శమించుగాక. కాకిపిల్ల కాకికి ముద్దన్నట్లు తమ గారాల బిడ్డ మండోదరికి ఏ వరుడూ నచ్చడం లేదని మల్లేశ్వరరావు దంపతులు ప్రచారం చేసుకొంటుంటారు. 'అందానికి తోడు సంగీతం కూడా ఉండాలండీ నా బిడ్డకు' అంటూ ఆమెను సంగీత పాఠశాలలో చేర్పించాడు. ఇదే నాకు తీరని శాపంలా పరిణమించింది. ఉదయం ఆరు గంటలకు వాకింగ్ వెళ్ళేవాడ్ని. ఇప్పుడు మండోదరి, భ్రష్ట సంగీత సాధన మూలంగా అయిదు గంటలకే లేచి పరుగులు పెట్టాల్సి వస్తోంది.

కానీ ఈ రోజు అరగంట ముందుగానే లేచి ఆమె సాధన మొదలు పెట్టడంతో బలవంతంగా బయటికి గెంటినట్లు ఇల్లొదిలి ఆ చీకట్లో నడిచి, కూతవేటు దూరంలో మండోదరి సంగీతసాధన వినిపించని రాయాలయంలో కూర్చున్నాను. చీకటి పొరలు విడిపోయేంతవరకు నిశ్శబ్దంగా రామనామం జపంచేసి, తరువాత మార్నింగ్ వాక్‌కి బయలుదేరాను.

నేను వాకింగ్ నుంచి తిరిగొచ్చేసరికి నా భార్యతో చెబుతోంది మండోదరి. "సంగీత కళాశాలలో స్టూడెంట్లు, లెక్చరర్లు, ప్రిన్సిపాలు నా గాన మాధుర్యాన్ని ఎంతగానో మెచ్చుకుంటారు మామ్మా. అపర సంగీత సరస్వతి ఈ భూమ్మీదికి వచ్చిపడిందని ఒకటే పొగడ్డం అనుకో"

తరువాత నన్ను చూసి "అరె తాతయ్య కూడా వచ్చేశారే, తాతయ్యకు కూడా ఈ విషయం చెప్పెయ్యాలి" అంది.

"ఫరవాలేదమ్మా, నేనంతా విన్నాను. భగవంతుడి కటాక్షం నీకు వుంది. ఏ నాటికయినా నీవొక ప్రముఖ సంగీత విద్యాంసురాలివవుతావు" అంటూ దీవించాను.

"మీ ఆశీర్వాదం ఊరికేపోదు తాతయ్యా!" అంది నిజంగానే తానొక గొప్ప విద్యాంసురాలినని మురిసిపోతూ.

అలా ఈ రోజు ఆమె నుంచి తప్పించుకుని బయటపడ్డాను.

ప్రశాంతతకు అలవాటు పడిన నాకు, తన గానంతో అలజడి సృష్టించే మండోదరికి మౌనపోరాటం జరుగుతుండగా, ఆ ఉదయం ఓ విచిత్రమైన సంఘటన జరిగింది.

ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో వరండాలో ఈజీచైర్‌లో కూర్చొని పేపరు చదువు కొంటున్నాను. ఇంతలో ఒక విచిత్రమైన వ్యక్తి గేటు తీసుకుని లోపలికి వచ్చాడు.

అతనికి సుమారు ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా నల్లగా రివటలా ఉన్నాడు. సన్నగీరల బ్యాగీ పాంటు, లూజుగా వున్న బొమ్మల చొక్కా, టక్ చేసి వున్నాడు. నల్లగా, గుబురుగా పెరిగిన వెంట్రుకలు. కళ్ళకు నల్ల కూలింగ్ గ్లాసులు, భుజాన బ్యాగు తగిలించుకుని ఉన్నాడు. క్రాపు ముఖం మీద పడుతుంటే స్టైలుగా పక్కకు నెట్టుకుంటూ వచ్చాడు.

'ఎవరీ అపరిచిత వ్యక్తి' అననుకొంటుండగానే ఆ వ్యక్తి తన భుజాన వేసుకున్న బ్యాగు పక్కనబెట్టి, బోర్లాపడుకొని, సాష్టాంగ నమస్కారం పెడుతూ, నా రెండు పాదాలు పట్టుకొన్నాడు. అంతేగాక "గ్రాండ్‌ఫా.... నువ్వే నాకు దిక్కు" అన్నాడు.

నేను ఆశ్చర్యపోతూ, "అలా కూర్చోండి" అంటూ ఎదురు కుర్చీ చూపించాను మర్యాదగా.

అతనా కుర్చీలో కూర్చోకుండా నా కాళ్లదగ్గర కూర్చుని ఒక ఉత్తరం అందించాడు. చించి చదివాను. అది ఒకప్పటి నాకొలీగ్ వీర్రాజు వ్రాసింది. రిటైరయి రాజమండ్రిలో స్థిరనివాసమేర్పరచుకొని ఉన్నాడు. ఉత్తరం తెచ్చినవాడు తన మనవడని, వాడికి రాజమండ్రి నుంచి ఈఊరికి బదిలీ అయిందని, వాడి బాగోగులు చూడు అని వ్రాశాడు.

ఉత్తరం చదవడం పూర్తి చేశానని తెలుసుకుని, "నాపేరు మన్మథరావు గ్రాండ్‌ఫా..." అంటూ అనవసరంగా రాని కన్నీళ్లు తుడుచుకున్నాడు అనాథలా.

నేను అతనికి ధైర్యం చెప్పి, వరండాకి ఆనుకొని వున్న ముందు గదిలో ఉండమని చెప్పాను. ఎంతో సంతోషించాడు మన్మథరావు.

ఇంతలో మా సంభాషణ విని నా భార్య బయటికి వచ్చింది. మన్మథరావు వాసన పసిగట్టిన కుక్కలా ఎగిరిగంతేసి "అరె గ్రాండ్‌మానా, మహాలక్ష్మిలాగుంది. చనిపోయిన మా అమ్మమ్మ గుర్తుకొస్తోంది" అంటూ సాష్టాంగపడి ఆమె పాదాలు కళ్ళకద్దుకున్నాడు.

మురిసిపోయిన ఆమె, "చిరంజీవ... చిరంజీవ... సుఖీభవ... సుఖీభవ" అంటూ అప్పటి వరకూ వంటకోసం బియ్యం చెరుగుతూ పిడికట్లో పట్టుకొని ఉన్న బియ్యాన్ని అతని నెత్తిమీద చల్లింది.

మన్మథరావు నేలమీద కూర్చుని క్రిందపడ్డ బియ్యపు గింజలు కళ్లద్దుకుని నోట్లో వేసుకున్నాడు.

'అదేమిటి నాయనా. అవి తింటావు' అంటూ నొచ్చుకుంది మా ఆవిడ.

"ఏం చేసేది గ్రాండ్‌మా. ఉదయం ట్రెయిన్‌లో ముఖం కడుక్కున్నా. ఇప్పటి వరకూ టిఫిన్ చేయలేదు" ఏడుపు ముఖం పెట్టుకుని అన్నాడు.

"అయ్యో అలాగా, నాయనా. స్నానం చేసిరా. నీకు నేను టిఫిన్ పెడతాను. అబ్బాయికి గది చూపించండి..." హడావిడిగా అంది మా ఆవిడ.

నా భార్య కూడా మన్మథరావు ప్రవర్తనకు ప్రసన్నం కావడం నాకు చాలా ఆనందంగా వుంది.

ఫర్నిచరుతో ఉన్నగది మన్మథరావుకి బాగా నచ్చిటనట్లుంది. బ్యాగు టేబులు మీద పెట్టాడు. టేబులు మీదున్న లెదరు బ్యాగు కదులుతూ వుంటే "అదేమిటి? బ్యాగు దానికదే కదులుతోంది. అందుల్లో ఏముంది నాయనా" అనడిగాను.

"అందులో ఒక ప్రాణి ఉంది గ్రాండ్‌ఫా. బ్రహ్మచారిని కదా తోడుకోసం" అంటూ బ్యాగ్ వైపు నడిచాడు. జిప్ లాగగానే బ్యాగులోంచి బయటకు దూకింది ఓ బాల మర్కటం.

"ఆయ్ జూమ. గ్రాండ్‌ఫాకు సమస్కారం పెట్టు" అన్నాడు. అది నావైపు కళ్లు చికిలించి చూసి, చేతులతో పొట్ట ఒకసారి గోక్కొని, రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకొని నమస్కారం చేసింది.

"వాటీజ్ దిస్" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇది 'జూమ' అంటే జూనియర్ మన్మథరావు. ఇది నా పెంపుడు జంతువు. దీనివల్ల మీకేమి ప్రమాదముండదు గ్రాండ్‌ఫా. ఎవరు ఏ పని చెప్పినా చేస్తుంది. గ్రాండ్‌మాకు అన్ని పనుల్లోను సాయం చేస్తుంది."

"నీకిదేం పిచ్చి మన్మథరావ్"

"పిచ్చికాదు గ్రాండ్‌ఫా. ఒక మహత్తర కార్యం కోసం దీన్ని పెంచుతున్నాను. నేనొక అభ్యుదయ కవిని, డిక్టేట్ చేస్తే వ్రాసేవాళ్ళు కావాలి. దానికి జీతమిచ్చి వ్యక్తిని మెయిన్‌టెయిన్ చెయ్యడం చాలా కష్టం. కనుక దీన్ని పెంచుతున్నాను. ఈ మధ్యనే అక్షరాభ్యాసం కూడా చేయించాను. నాస్టైయిలే వేరు" అన్నాడు ముఖాన పడ్డ జుట్టును వెనక్కు నెట్టుకుంటూ.

"ఓరి నీ పాపం కూలా" అనుకొని "మరి దీని పోషణ భారం నాయనా" నా సందేహం బైటపెట్టాను.

"ఏముంది జస్ట్ ఉదయం పూట గ్రాండ్‌మా మిగిలిపోయిన ఇడ్లీముక్కలో, చపాతి ముక్కలో వేస్తే తిని ఊరుకుంటుంది. మామూలుగా ఆఫీసుకు వెళ్లేప్పుడు ఏదో ఒక జామచెట్టుమీద నాక్‌గా వదిలేస్తుంటాను. తిరిగి వచ్చేటప్పుడు కలెక్ట్ చేసుకుని బ్యాగ్‌లో పడేసుకుని వస్తుంటాను. ఇక్కడ మన ఇంట్లోనే జామ చెట్టు వుంది కాబట్టి ఇప్పుడు ఆ ప్రాబ్లెమ్ కూడా లేదు" ఆనందంగా అన్నాడు మన్మథరావు.

'ఒరే నీపేరు మన్మథరావు కాదు. మర్కటరావు అంటే బాగుటుంది. నీవొక సీనియర్ మర్కటరావువి. అదొక జూనియర్ మర్కటరావు' అనుకొని, "ముందు స్నానం చేయి, నేను వెళ్తున్నా" అంటూ గదిలోంచి బయటపడ్డాను.

అరగంట తరువాత 'జూమ' నెత్తుకొని నేరుగా డైనింగ్ హాల్లోకి వచ్చి కూర్చున్న మన్మథరావు, "గ్రాండ్‌మా... నేను టిఫిన్‌కి రెడీ" అన్నాడు.

"ఛీ... ఛీ... అదేమిటి కోతిపిల్ల, బయట పారెయ్యి" మన్మథరావు ఒళ్లోని 'జూమ'ను చూస్తూ పెద్దగా అరచింది నాభార్య.

మన్మథరావు అది చాలా తప్పన్నట్లు నోటికి అరచేయి అడ్డుపెట్టుకుని, తీసి, "గ్రాండ్‌మా 'జూమ' చాలా మర్యాదకల వాడు. అలాంటి పని చేస్తేవాడు జీవితంలో మిమ్మల్ని క్షమించడు. మీకే ఇబ్బంది రాకుండా చూసే బాధ్యత నాది" అంటూ నాకు చెప్పినట్లే దాని కథంతా మా ఆవిడకు చెప్పాడు.

మా ఆవిడ టిఫిన్ వడ్డిస్తుంటే తను తింటూ మధ్యలో 'జూమ' కు కూడా తినిపించాడు. టిఫిను అయిన, తరువాత తాను మరుసటి రోజు ఉద్యోగంలో చేరతానని, ఈ రోజుకు రెస్టు తీసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ తాను రేపట్నుంచి హోటల్లో తింటానని ఇష్టంలేని ముఖం పెట్టి చెప్పాడు.

"నాయనా నువ్వు తినే పిడికెడు మెతుకులకు హోటలెందుకు. మా ఇంట్లోనే తిను" అన్న నా భార్య మాటలు మన్మథరావుకి ఎంతో ఆనందాన్ని కలిగించాయి.

సీనియర్ మన్మథరావు గదిలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకుంటుంటే, 'జూమ' మా ఇంటి ముందున్న జూమ చెట్టెక్కి రెస్టు తీసుకుంటోంది. అలా వుంటే ఫరవాలేదు. ఆ సాయంత్రం అది చేసిన కొంటె పనేనాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆ సాయంత్రం అయిదు గంటలప్పుడు మండోదరి కేకలు విని వరండాలోకి వచ్చాను.

మండోదరి తల్లి మన్మథరావుని గద్దించి అడుగుతూ వుంది. "ఈరంగుల లుంగీ నీదేకదూ. మా బాత్ రూమ్‌లోకి ఎలా వచ్చింది?"

"లుంగీ నాదేఆంటీ, సాయంత్రం స్నానం చేసి వదిలేశాను. మీ బాత్ రూములోకి ఎలా వచ్చిందో నాకు తెలియదు. ఉండండి ఇప్పుడే వస్తాను" అంటూ హడావుడిగా గదిలోకి వెళ్ళిన మన్మథరావు, చేతిలో లంగాతో వచ్చాడు.

"చూడండి. ఇది మీదేనా. సాయంత్రం నేను నిద్రలేచేసరికి నా మంచం క్రింద వుంది."

"ఇది నా కూతురు మండోదరిది. ఎలా నీ గదిలోకి వచ్చింది. ఇది మర్యాదస్తుల పనేనా?" అంటూ మళ్ళీ అరచింది మండోదరి తల్లి.

ఇంతలో లోపల నుంచి మండోదరి, "అమ్మా ఇదేంటే మన బాత్‌రూమ్‌లో వుంది" అంటూ ఓ అండర్ వేర్ ఎత్తి పట్టుకుని వచ్చింది. మన్మథరావుని చూస్తూనే మెలికలు తిరిగిపోయి, "ఛ" అంటూ ఆ అండర్‌వేర్ వదిలేసింది.

"అయ్యో ఇది నా అండర్ వేర్. మీ బాత్‌రూమ్‌లోకి ఎందుకు వచ్చింది? నాకు సమాధానం కావాలి." ముఖం చిటమట లాడిస్తూ అడిగాడు మన్మథరావు.

పొరపాటు రెండు వైపులా వుంది కాబట్టి ఇలాంటివి మళ్ళీ జరగకుండాచూడమని ఇద్దరినీ హెచ్చరించాను. అంతటితో ఆ వివాదం ముగిసిపోయింది. తలెత్తి చూసిన నాకు చెట్ల కొమ్మల మధ్య నుంచి నన్నే చూస్తూ 'జూమ' కిచకిచలాడడం కనిపించింది.

దీనికంతటికీ కారణమెవరో ఇప్పుడు చూచాయిగా నాకు అర్థమయింది.

మరుసటి రోజు ఉదయం మార్నింగ్ వాక్ నుండి వచ్చిన నాకు ఆ దృశ్యం అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించింది. మండోదరి పోర్షను ముందు నిలబడి ఆమె తల్లితో మాట్లాడుతున్నాడు మన్మథరావు.

"ఆంటీ మరేం అనుకోకు. ఉదయం మీ ఇంట్లోంచి నాకు గంధర్వ గానం వినిపించింది. ఎక్కడ దొరుకుతుంది ఆ క్యాసెట్ చెప్పు ఆంటీ" అంటున్నాడు గోముగా.

తల్లికి వెనుకగా కొద్ది దూరంలో నిలబడి ఉన్న మండోదరి అయితే సరేసరి. తలవంచుకుని పైట కొంగును చేతి వేలికి చుట్టుకుంటూ తెగ సిగ్గుపడుతోంది.

"మాఇంట్లో ఏ టేప్‌రికార్డరూ లేదు నాయనా. అది మా అమ్మాయి సంగీత సాధన" అంటూ ప్రక్కనే ఉన్న మండోదరిని చూపింది.

'అవునా' అంటూ బోలెడు ఆశ్చర్యాన్ని ప్రకటించిన మన్మథరావు, "ఎంతో బాగుందండీ ఆ టోన్. ఎంతసేపు విన్నా ఇంకా ఇంకా వినాలనిపిస్తోంది" అంటూ తెగ పొగిడాడు.

మురిసిపోయిన మండోదరి, సిగ్గుల మొగ్గవుతూ, "అమ్మా, వారిని రాత్రి భోజనానికి మనింటికి పిలువు. నా సంగీతం వినిపిస్తాను" అంది గారంగా.

ఆమె అభ్యర్థన మేరకు మండోదరి తల్లి మన్మథరావుని భోజనానికి పిలవడం, ఆ రాత్రి అతను భోజనానికి వెళ్ళడం. చాలా సేపటి వరకూ సంగీతలాపన, తరువాత పొద్దుపోయేంతవరకూ చర్చలూ జరిగాయి.

ఇలా ఇది ఒక్కరోజుతో పోలేదు. రోజూ దినచర్య అయిపోయింది. ఇంతేగాక 'జూమ' మండోదరి ఇంటి నుంచి మన్మథరావు గదికి తెచ్చేలంగా మడతల్లోనూ, అలాగే మన్మథరావు గది నుంచి తీసుకెళ్ళి మండోదరి ఇంట్లో వేసే లుంగీ పొరల్లోను యథేచ్ఛగా ప్రేమలేఖలు బట్వాడా అవుతున్నాయని నాకు చూచాయిగా తెలిసింది. అంతేగాక మండోదరి నా ముందు చాలాసార్లు మన్మథరావు కవిత్వాన్ని విపరీతంగా పొగిడి సిగ్గుపడిపోవడం నా అనుమానాన్ని దృఢపరిచింది.

ఇక లాభం లేదని నా స్నేహితుడు వీర్రాజుకు రాజమండ్రికి ఉత్తరం వ్రాశాను. మన్మథరావు ఒక అనాకారి ప్రేమలో పడ్డాడని, వచ్చి రక్షించుకోమనీను. వీర్రాజు అర్జంటుగా ఊడిపడతాడనుకున్న నాకు నిదానంగా అతని ఉత్తరం రాలి పడింది. అందులోని సారాంశం. 'వాడిని చేసుకోవడానికి ఈ ఉభయగోదావరి జిల్లాల్లో ఏ ఆడపిల్లా ముందుకు రాలేదు. అనాకారయినా మండోదరి ఆడపిల్లే కాబట్టి 'గంతకు తగ్గ బొంతని' నువ్వే పెద్దరికం తీసుకుని వాళ్ళిద్దరికీ ముడెయ్యి. వాళ్ళ పెళ్ళికి ముహూర్తం పెట్టి నాకు తెలియజేస్తే పెళ్ళికి రెండు రోజులు ముందుగా వస్తాను' అని వ్రాశాడు.

ఉత్తరం చదివి దిక్కుతోచక తల పైకెత్తిన నాకు తోక వ్రేలాడేసి జామకాయను కొరుక్కుతింటూ నిక్కినిక్కి చూస్తూ దీనికంతటికి కారణమయిన 'జూమ' కనిపించింది ✸

**(ప్రియదత్త వీక్లీ, తేది. 28-11-2001)**